
సాక్షి
అనంతపురం
మంగళవారం, 30, ఏప్రిల్, 2024





**చీనీ టన్ను రూ.33 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33 వేలు పలికాయి.



**వన్నూరుస్వామిపై దాడి అవాస్తవం**

తోపుదుర్తికి చెందిన వన్నూరుస్వామిపై దాడి జరిగిందనే అంశం అవాస్తవమని ఆ గ్రామస్తులు స్పష్టం చేశారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
44.3°/26.5°

జిల్లా వ్యాప్తంగా సోమవారం భానుడు మండిపోయాడు. తీవ్ర ఉక్కపోత, వడగాల్పులు నెలకొన్నాయి. 10 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### ఉపాధి పనులు వేగవంతం చేయాలి



**అనంతపురం టౌన్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉపాధి హామీ సిబ్బందితో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ప్రతి మండలానికీ లక్ష్యం నిర్దేశించారన్నారు. మండలం యూనిట్‌గా రోజు వారీగా 5 వేల మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబం పనులకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ పనులు సైతం మందగించాయని, ఇలాంటి తరుణంలో ఉపాధి పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. రోజు వారి వేతనం రూ.300కు పెంచినట్లు తెలిపారు. పనుల వద్ద కూలీలకు తాగునీటితోపాటు మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ పనుల వద్ద కూలీలకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు.

### గిరిజన గురుకుల పాఠశాలల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తులు

**అనంతపురం రూరల్:** ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో 3 నుంచి 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామాంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం బాలికల పాఠశాలలో 83, బుక్కరాయసముద్రం బాలుర పాఠశాలలో 139, కళ్యాణదుర్గం బాలుర పాఠశాలలో 160, రాగులపాడు బాలుర పాఠశాలలో 190, ఉరవకొండ బాలికల పాఠశాలలో 127, కదిరి బాలికల పాఠశాలలో 77, కదిరి బాలుర పాఠశాలలో 154, గోరంట్ల బాలికల పాఠశాలలో 126, పెనుగొండ బాలికల పాఠశాలలో 165 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు మే 1 నుంచి 20 లోగా సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### హజ్ యాత్రికులకు వ్యాక్సిన్



**అనంతపురం మెడికల్:** జిల్లా నుంచి హజ్‌యాత్రకు బయలుదేరుతున్న యాత్రికులకు వ్యాక్సిన్ తప్పనిసరి అని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. వచ్చే నెల 2న ఉదయం 8.30 గంటలకు అనంతపురం నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హజ్ యాత్రకు వెళ్తున్న 216 మంది తప్పక క్యూ ఎంఎంవీ, ఎస్‌ఐవీ వ్యాక్సిన్లు వేయించుకోవాలని సూచించారు.

# పెరిగిన 'ఫ్యాను' గాలి

- సీఎం జగన్ పర్యటనల తర్వాత మరింత ఊపు
- పెద్ద సంఖ్యలో చేరికలతో వైఎస్సార్ సీపీలో జోష్
- ముఖ్య నాయకులు వీడడంతో టీడీపీ అభ్యర్థుల డీలా



తాడిపత్రిలో ఆదివారం జరిగిన రోడ్ షోలో ఫ్యాన్ గుర్తు చూపిస్తూ ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** సీఎం వైఎస్ జగన్ వరుస పర్యటనలతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. ఇటీవల కాలంలో ఆయన నిర్వహించిన పలు సభలు, యాత్రలతో కేడర్‌లోకి మరింత సానుకూల సంకేతాలు వెళ్లాయి. పార్టీ అధినేత పిలుపుతో ఉత్తేజితులవుతున్న నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో ఎన్నికల కదనరంగంలో కదం తొక్కుతున్నారు. ప్రతిపక్ష టీడీపీకి గుక్కతిప్పుకోలేనట్టుగా చేస్తున్నారు. దీంతో టీడీపీ అభ్యర్థుల్లో గుబులు రేగుతోంది.

**'అనంత'పై ప్రత్యేక అభిమానం**

ఉమ్మడి అనంతపురం జిల్లాపై ప్రత్యేక అభిమానముందని తన పర్యటనల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చాటుకున్నారు. గడిచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి హోదాలో ఆయన ఏడు నియోజకవర్గాల్లో నేరుగా పర్యటించారు. వివిధ ప్రభుత్వ పథకాల సొమ్మును బటన్ నొక్కి విడుదల చేశారు. రాయదుర్గం, పుట్టపర్తి, కళ్యాణదుర్గం, రాప్తాడు, ఉరవకొండ తదితర నియోజకవర్గాల్లో నిర్వహించిన సీఎం సభలకు విశేష స్పందన లభించింది. రైతులు, మహిళలు, విద్యార్థులు పోటెత్తారు. జననేతను అక్కున చేర్చుకున్నారు. ఈ విషయం కూడా ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు బాగా కలిసివచ్చిందని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోందని స్పష్టం చేస్తున్నారు.

**రాప్తాడు సభతోనే ఉత్తేజం**

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత కూడా ఉమ్మడి జిల్లాకు పలు సార్లు సీఎం వచ్చారు. శంఖారావం పూరించిన అనంతరం ఫిబ్రవరి 18న రాప్తాడు నియోజకవర్గంలో 'సిద్ధం' సభ ఏర్పాటు చేశారు. దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో లక్షలాది మంది ఈ సభకు హాజరయ్యారు. జాతీయ మీడియా సైతం ఈ సభను అతిపెద్ద బహిరంగ సమావేశంగా అభివర్ణించింది. సభలో వైఎస్ జగన్ చేసిన ప్రసంగం శ్రేణులను ఎంతగానో ఉత్తేజపరిచింది.

**బస్సు యాత్రలతో ఊపు.. తాడిపత్రి సభతో టాపు**

'సిద్ధం' సభల అనంతరం బస్సు యాత్రగా జిల్లాకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ వెంటే మరింత ఊపు తీసుకొచ్చారు. సీఎం వస్తున్నాడన్న వార్త తెలుసుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులే కాకుండా సాధారణ ప్రజలు ఆయనను చూసేందుకు తరలివచ్చారు. రోడ్లపై గంటల తరబడి నిల్చుని అభిమాన నేతను చూశాకే ఇంటికెళ్లారు. గుంతకల్లు నియోజకవర్గం నుంచి మొదలు కదిరి వరకూ నీరా'జనం' పలికారు. సీఎం జగన్‌పై తమ అభిమానం చాటుకున్నారు.

- బస్సు యాత్ర వెళ్లని నియోజకవర్గాల్లో ఎన్నికల సభలు నిర్వహించాలని నిర్ణయించిన సీఎం జగన్.. అందులో భాగంగా రెండు రోజుల క్రితం తాడిపత్రిలో నిర్వహించిన సభ జన సునామీని తలపించింది. మండే ఎండను సైతం లెక్క చేయకుండా జగన్ రాక కోసం కార్యకర్తలు, అభిమానులు వేచి చూశారు. మేనిఫెస్టో ప్రకటించిన అనంతరం సీఎం పాల్గొన్న ఈ సభ కార్యకర్తల్లో మరింత ఉత్తేజాన్నిచ్చింది.

**కీలక నేతల చేరికతో మరింత జోష్..**

వైఎస్ జగన్ బస్సు యాత్ర, ఎన్నికల సభల్లో టీడీపీ నేతలు, ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యేలు చాంద్ బాషా, నాగరాజారెడ్డి, పుట్టపర్తి టీడీపీ అభ్యర్థిగా చివరి వరకూ రేసులో ఉన్న రిటైర్డ్ డీఎస్పీ వేణుగోపాల్ తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే, టీడీపీ కురుబ సంఘం మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు బుల్లె శివబాలతో పాటు రెండు వందల మందికి పైగా నాయకులు పార్టీలో చేరడం వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో మరింత జోష్ నింపింది.

**టీడీపీలో కలవరపాటు**

ఇప్పటికే తమ ప్రచారాలకు జనం కరువై అల్లాడుతున్న టీడీపీ అభ్యర్థులకు ఈ పరిణామాలు మరింత కలవరపాటుకు గురి చేస్తున్నాయి. చంద్రబాబుకు రూ. కోట్లకు కోట్లు సమర్పించుకుని సీట్లు తెచ్చుకుంటే.. ఇప్పుడిలా అవుతోందేంటని లోలోనే మదనపడుతున్నట్లు తెలిసింది.

## 'దగ్గుపాటి' హంతకుడు, కబ్జాకోరు

- అతను గెలిస్తే హత్యలు, భూకబ్జాలు పెరిగిపోతాయి
- రాప్తాడు ఎంపీపీగా ఉన్నప్పుడు ఎన్నో అరాచకాలు చేశాడు
- అలాంటి నేరస్తునికి టీడీపీ టికెట్ ఇవ్వడం శోచనీయం
- 'అనంత' ప్రజలు అతన్ని ఓడించి ప్రశాంతతను కాపాడుకోవాలి
- వైఎస్సార్ సీపీ నేత భూమిరెడ్డి మహానందరెడ్డి పిలుపు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత భూమిరెడ్డి మహానంద రెడ్డి

**అనంతపురం కార్పొరేషన్:** 'అనంతపురం అర్బన్ టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ హత్యా నేరస్తుడు, కబ్జాదారుడు. పొరపాటున అతను గెలిస్తే నగరంలో ప్రశాంతతను దెబ్బతీస్తాడు. హత్యలు, భూకబ్జాలు పెరిగిపోతాయి. కావున ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలి. నేరస్తులకు ఇక్కడ తావు లేదన్న సందేశాన్ని ఇస్తూ దగ్గుపాటిని చిత్తుగా ఓడించాల'ని వైఎస్సార్ సీపీ నేత భూమిరెడ్డి మహానంద రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అనంతపురం నియోజకవర్గ చరిత్రలో గతంలో ఏ పార్టీ హత్యా నేరస్తులకు టికెట్ ఇవ్వలేదన్నారు. కానీ ఈ ఎన్నికల్లో చంద్రబాబు, లోకేష్ డబ్బుకు ఆశపడి తన సోదరుడు భూమిరెడ్డి శివప్రసాద్ రెడ్డి హత్య కేసులో నిందితుడు, కబ్జాదారుడైన దగ్గుపాటి ప్రసాద్‌కు టికెట్ ఇచ్చారని విమర్శించారు.

**రూ.25 లక్షలిచ్చి నా అన్నను హత్య చేయించాడు**

టీడీపీ ప్రభుత్వంలో రాప్తాడు ఎంపీపీగా ఉన్న దగ్గుపాటి నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు తన అన్న భూమిరెడ్డి శివప్రసాద్ రెడ్డిని తహసీల్దార్ కార్యాలయంలో దారుణంగా హత్య చేసిన విషయాన్ని మహానందరెడ్డి గుర్తు చేశారు. తమ కుటుంబ ప్రధాన శత్రువులను పోగు చేసి రూ.25 లక్షల నగదు, స్కార్పియో వాహనం ఇచ్చి తన అన్నను హత్య చేయించిన దుర్మార్గుడు దగ్గుపాటి అని దుయ్యబట్టారు. అప్పటి అధికార పార్టీ అండతో చార్జ్‌షీట్ నుంచి దగ్గుపాటి ప్రసాద్‌తో పాటు మరో ఐదుగురి పేర్లను పోలీసులు తొలగించారన్నారు. హత్యలో కీలకంగా ఉన్న వీరిని చార్జ్‌షీట్‌లో తిరిగి చేర్చాలంటూ తాము 2018లో కోర్టును ఆశ్రయించామన్నారు. దీంతో దగ్గుపాటితో పాటు రాప్తాడు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, సాంబశివారెడ్డి, వంకాయల ఆదెప్ప, హరికుమార్, రొట్టెల నాగదివాకర్‌లను చార్జ్‌షీట్‌లో చేర్చుతూ విచారణ వేగవంతం చేయాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. కానీ దగ్గుపాటి తన అధికార, డబ్బు బలాన్ని వినియోగించుకుని విచారణ జాప్యమయ్యేలా చూశాడన్నారు. ఈ కేసులో దగ్గుపాటికి శిక్ష తప్పదన్నారు.

**కరుడుగట్టిన నేరస్తులతో ప్రచారం**

భూమిరెడ్డి శివప్రసాద్ రెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న పంచగల శ్రీనివాసులు తదితర కరుడుగట్టిన నేరస్తులతో కలసి దగ్గుపాటి ఎన్నికల ప్రచారం చేస్తున్నాడంటూ.. అందుకు సంబంధించిన ఫొటోలను మహానందరెడ్డి మీడియాకు చూపించారు. ఎంపీపీగా ఉన్న సమయంలో లేఅవుట్లు వేసిన వారితో రూ.లక్షలు వసూలు చేశారన్నారు. సిఫ్లాన్ డ్రగ్స్ కంపెనీలో రూ.4 వేల జీతానికి పనిచేసిన దగ్గుపాటి ఇప్పుడు ఏవిధంగా రూ.వేల కోట్లకు అధిపతి అయ్యాడని ప్రశ్నించారు. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి సర్వే నంబర్ 123/3లో సమీప బంధువు దగ్గుపాటి దీప్తి పేరు మీద మూడెకరాల వంక పోరంబోకు స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. ఇటువంటి వ్యక్తి అనంతపురంలోకి వస్తే హత్యానేరాలు, భూకబ్జాలు పెరిగిపోతాయన్నారు. నియోజకవర్గ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి, ఈ ఎన్నికల్లో మంచి చేసే ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి అండగా నిలవాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు నాగార్జున రెడ్డి, రామాంజినేయులు, భాస్కర్, మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఓటుహక్కు వినియోగించుకోండి

**తాడిపత్రి అర్బన్:** ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల సాధారణ వ్యయ పరిశీలకులు మనీష్ సింగ్, విలాస్ వి.షిండే సూచించారు. సోమవారం వారు తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గంలో పర్యటించారు. నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణం, యాడికి మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో వసతులు, ఓటరు సమాచార చీటీల పంపిణీ, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ ఎన్నికల అధికారి రామభూపాల్ రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, డీఎస్పీ గంగయ్య పాల్గొన్నారు.

### ఎండలో బయటకు వెళ్లొద్దు

**అనంతపురం అగ్రికల్చర్:** వడదెబ్బ బారి నుంచి తప్పించుకోవాలంటే మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదని వైద్యులతో పాటు వ్యవసాయ, వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ జి.నారాయణస్వామి సూచించారు. మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్, గ్లూకోజ్, నిమ్మరసం, బియ్యంనీరు (తోరణి), కొబ్బరినీళ్లు, పండ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. వదులుగా ఉండే తెల్లటి కాటన్ దుస్తులు, టోపీ, గొడుగు, శరీర అవయవాలకు సూర్యరశ్మి తాకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దాహం వేయకున్నా తరచు నీళ్లు తాగాలన్నారు. తలతిరగడం, తిమ్మిర్లు, దుద్దుర్లు, తలనొప్పి, మైకం, వికారం, చెమటలు, మూర్ఛ లాంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

"జగన్.. రేపు నిన్ను చంపితే ఏమవుతుంది"

అంటూ రెండు రోజుల క్రితం నెల్లూరు జిల్లాలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ నేతలు మండిపడ్డారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అలజడులు రేపేందుకే నీచ రాజకీయాలకు తెరలేపారని దుయ్యబట్టారు. వారి మాటల్లోనే..

### ఓడిపోతానని తెలిసే..



**గుత్తి:** ఓడిపోతాననే తెలిసే చంద్రబాబు నోటికొచ్చిన మాటలు మాట్లాడుతున్నారని వైఎస్సార్ సీపీ అనంతపురం ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర నారాయణ, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య అన్నారు. గుత్తిలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కల్లు తాగిన కోతిలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని తెలిసి ఆందోళనకు గురవుతున్న ఆయనకు.. ఏది మాట్లాడుతున్నాడో తనకే అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. త్వరలో టీడీపీతో పాటు చంద్రబాబు, లోకేష్, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌లు భూస్థాపితం అవుతారన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సర్వ సాధారణమని, చంద్రబాబు మాత్రం పరాభవం తప్పదని తెలిసి నానా యాగీ చేస్తున్నాడన్నారు. ఏకంగా సీఎం వైఎస్ జగన్‌ను చంపితే ఏమవుతుందని అంటున్నాడంటే అతని తిక్క పీక్‌కు వెళ్లిందనే విషయం అర్థమవుతోందన్నారు.

### జగన్‌ను ఎదుర్కొనే ధైర్యంలేకే..



**అనంతపురం కార్పొరేషన్:** ప్రజాక్షేత్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేకే టీడీపీ అధినేత చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. నగరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించేలా చంద్రబాబు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. వైఎస్ జగన్ విశ్వసనీయతకు, చంద్రబాబు మోసాలకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రజలే టీడీపీకి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

### బరితెగించిన బాబు



**తాడిపత్రి రూరల్:** ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో చంద్రబాబు రోజురోజుకూ మరింతగా బరి తెగిస్తున్నారని ఎమ్మెల్యే పెద్దారెడ్డి అన్నారు. స్థానిక తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తూ రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రెండు రోజుల క్రితం నెల్లూరులో జరిగిన సభలో 'జగన్ రేపు నిన్ను హత్య చేస్తే ఏమవుతుంది' అంటూ నీచంగా మాట్లాడారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, మద్దతుదారులపై కూడా దాడులు చేయండి అంటూ పిలుపునిస్తుండడం దుర్మార్గమన్నారు. జగనన్న షర్ట్ నలిగినా రాష్ట్రంలో బాబు అండ్ కో రోడ్డుపై తిరగలేరని హెచ్చరించారు.

### ఓటమి భయంతోనే..



**ఉరవకొండ:** ఓటమి భయంతోనే చంద్రబాబు పిచ్చిమాటలు మాట్లాడుతున్నారని వైఎస్సార్ సీపీ ఉరవకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి బస్సు యాత్రలకు వస్తున్న ప్రజాదరణ చూసి బాబు తట్టుకోలేకపోతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనను ప్రజలు మరోసారి బలంగా కోరుకుంటున్నారని తెలుసుకుని నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అలజడులు రేపేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు.

### చంద్రబాబును అరెస్టు చేయాలి



**అనంతపురం కార్పొరేషన్:** చంద్రబాబు వ్యాఖ్యలు అప్రజాస్వామికమని, ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి బాబును అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురంలో ఆయన మాట్లాడుతూ నేరచరిత్ర కల్గిన పార్టీ టీడీపీ అని ధ్వజమెత్తారు. గతంలో పరిటాల రవిని ప్రోత్సహించి 753 మంది హత్యలకు చంద్రబాబు కారణమయ్యారన్నారు. హత్యకు గురైన వారిలో 50 శాతానికి పైగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారని వాపోయారు. నారా లోకేష్ సైతం రెడ్‌బుక్ పేరిట అధికారులను బెదిరింపులకు గురి చేయడం దుర్మార్గమన్నారు.

## అతివలే అధికం

- అనుబంధ ఓటర్ల జాబితా విడుదల
- పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువ



కళ్యాణదుర్గం నియోజకవర్గానికి పంపించేందుకు సిద్ధం చేసిన ఓటర్ల జాబితా కట్టలు

**నియోజకవర్గాల వారీగా ఓటర్లు**

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | థర్డ్ జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| రాయదుర్గం | 1,30,794 | 1,33,516 | 42 | 2,64,352 |
| ఉరవకొండ | 1,10,540 | 1,13,771 | 28 | 2,24,339 |
| గుంతకల్లు | 1,32,943 | 1,37,630 | 75 | 2,70,648 |
| తాడిపత్రి | 1,23,496 | 1,25,358 | 26 | 2,48,880 |
| శింగనమల | 1,22,927 | 1,24,417 | 29 | 2,47,373 |
| అనంతపురం | 1,37,708 | 1,43,479 | 27 | 2,81,214 |
| కళ్యాణదుర్గం | 1,14,356 | 1,16,422 | 7 | 2,30,785 |
| రాప్తాడు | 1,25,028 | 1,25,531 | 12 | 2,50,571 |
| మొత్తం | 9,97,792 | 10,20,124 | 246 | 20,18,162 |

**అనంతపురం అర్బన్:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితాకు అనుబంధ ఓటర్ల జాబితా సిద్ధమైంది. దీని ప్రకారం తుది ఓటర్ల జాబితా తరువాత 23,618 మంది ఓటర్లు పెరిగారు. ప్రస్తుత జాబితా ప్రకారం జిల్లాలో 20,18,162 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 9,97,792 మంది, మహిళా ఓటర్లు 10,20,124 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 246 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 22,332 మంది ఎక్కువగా ఉన్నారు. ఈ ఏడాది జనవరి 22న జిల్లా ఎన్నికల యంత్రాంగం విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 19,94,544 మంది ఓటర్లు ఉన్నారు. జనవరి 22 నుంచి ఈనెల 14వ తేదీ వరకు ఓటర్ల నమోదుకు వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అర్హులైన 23,618 మందికి ఓటుహక్కు కల్పిస్తూ అనుబంధ ఓటరు జాబితాను తయారు చేశారు.

**తుది జాబితా ఇలా...**

తుది జాబితా ప్రకారం 19,94,544 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుష ఓటర్లు 9,88,176 మంది, మహిళ ఓటర్లు 10,06,123 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 245 ఉన్నారు. ప్రస్తుత జాబితా ప్రకారం ఆ సంఖ్య 20,18,162 మందికి పెరిగింది. తుది జాబితా తరువాత పురుష ఓటర్లు 9,616 మంది, మహిళా ఓటర్లు 14,001 మంది, థర్డ్ జెండర్ ఒక ఓటు మొత్తం 23,618 మంది ఓటర్లు పెరిగారు.

**అనంతలోనే అత్యధికం..**

పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అత్యధికంగా అనంతపురం నియోజకవర్గంలో 5,771 మంది ఉన్నారు. ఆ తర్వాత గుంతకల్లు నియోజకవర్గంలో 4,687 మంది, ఉరవకొండ నియోజకవర్గంలో 3,231 మంది, రాయదుర్గంలో 2,722 మంది, కళ్యాణదుర్గంలో 2,066 మంది, తాడిపత్రిలో 1,862 మంది, శింగనమలలో 1,490 మంది, రాప్తాడు నియోజకవర్గంలో 503 మంది మహిళా ఓటర్లు పురుష ఓటర్ల కంటే ఎక్కువగా ఉన్నారు.

**పెరిగిన ఓటర్లలో రాయదుర్గం అత్యధికం..**

తుది జాబితా తరువాత రాయదుర్గం నియోజకవర్గంలో జిల్లాలోనే అత్యధికంగా 3,493 మంది ఓటర్లు పెరిగారు. ఆ తర్వాత ఉరవకొండలో 1,616 మంది ఓటర్లు, గుంతకల్లులో 3,612 మంది ఓటర్లు పెరిగారు. అదే విధంగా తాడిపత్రి నియోజకవర్గంలో 4,805 మంది ఓటర్లు, శింగనమలలో 1,748 మంది, అనంతపురం అర్బన్‌లో 2,739 మంది, కళ్యాణదుర్గంలో 3,347 మంది, రాప్తాడు నియోజకవర్గంలో 2,258 మంది ఓటర్లు మొత్తం 23,618 మంది ఓటర్లు పెరిగారు.

## ఎన్నికల బరిలో నిలిచింది వీరే

- ముగిసిన ఉపసంహరణ ప్రక్రియ
- బరిలో 134 మంది అభ్యర్థులు
- స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల గుర్తుల కేటాయింపు



అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కేటాయిస్తున్న కలెక్టర్, రిటర్నింగ్ అధికారి వి.వినోద్‌కుమార్

**అనంతపురం అర్బన్:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 134 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం ముగిసింది. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం స్థానానికి ఉపసంహరణ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి వి.వినోద్ కుమార్ నిర్వహించారు. అసెంబ్లీ స్థానాలకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రక్రియను చేపట్టారు. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి పోటీలో ఉన్న 21 మంది అభ్యర్థుల్లో ఎవరూ తమ నామినేషన్‌ను ఉపసంహరించుకోలేదు. దీంతో బరిలో 21 మంది అభ్యర్థులు నిలిచారు. అలాగే, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గం స్థానాల నుంచి 136 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా 23 మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో 113 మంది ఎన్నికల బరిలో నిలిచినట్లయింది. ఆయా అభ్యర్థులకు గుర్తులను రిటర్నింగ్ అధికారులు కేటాయించారు.

**పార్లమెంట్ స్థానానికి..**

గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి నలుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాలగుండ్ల శంకరనారాయణ, టీడీపీ అభ్యర్థిగా అంబికా జి.లక్ష్మినారాయణ, భారత జాతీయ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా మల్లికార్జున వజ్జల, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా బనాసి నారాయణప్ప పోటీలో ఉన్నారు. అదే విధంగా రిజిస్టరు చేసిన రాజకీయ పార్టీల అభ్యర్థులు (గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ అభ్యర్థులు కాని ఇతరులు) తొమ్మిది మంది, స్వతంత్ర అభ్యర్థులు ఎనిమిది మంది మొత్తం 21 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.

**అసెంబ్లీ స్థానాలకు..**

రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి 13 మంది అభ్యర్థులు, ఉరవకొండలో 11 మంది, గుంతకల్లు 14 మంది, తాడిపత్రిలో 18 మంది, శింగనమలలో 14 మంది, అనంతపురం అర్బన్‌లో 15 మంది, కళ్యాణదుర్గంలో 15 మంది, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి 13 మంది అభ్యర్థులు.. మొత్తం ఎనిమిది నియోజకవర్గాల అసెంబ్లీ స్థానాలకు 113 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.

## క్లుప్తంగా

### ఎస్పీ ఆకస్మిక తనిఖీ


తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

**అనంతపురం:** క్షేత్రస్థాయి పరిశీలనల్లో భాగంగా నగరంలోని పోలీసు స్టేషన్లను ఎస్పీ అమిత్ బర్దర్ సోమవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలు, కాలనీల్లో నెలకొన్ని సమస్యలు, శాంతి భద్రతల పరిరక్షణపై ఆయా స్టేషన్ హౌస్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించరాదని సూచించారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునే పరిస్థితులు కల్పించాలన్నారు. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు.

### బొలెరో ఢీకొని ఒకరి మృతి


మృతుడు నాగశేషు

**పెద్దవడుగూరు:** బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.... పుట్లూరు మండలం గరుగుచింతలపల్లికి చెందిన నాగశేషు(32) పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లిలోని బంధువుల ఇంటికి సోమవారం వచ్చాడు. పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన క్రిష్టిపాడు సమీపంలో జాతీయ రహదారిపైకి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగశేషు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

### సింహ వాహనంపై అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న చౌడేశ్వరమ్మ ఉత్సవ మూర్తి

**అమడగూరు:** భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న అమడగూరు చౌడేశ్వరీ దేవి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సింహ వాహనంపై అమ్మవారు దర్శనమిచ్చారు. ఉత్సవానికి ఉభయదారులుగా కొలిమిరాళ్లపల్లికి చెందిన జెడ్పీటీసీ దంపతులు కడగుట్ట కవిత, శివశంకర్‌రెడ్డి వ్యవహరించారు. ఆలయం నుంచి ఊరేగిస్తూ గ్రామ నడిబొడ్డున ఉన్న ఉట్టి వద్దకు తీసుకెళ్లి భక్తుల దర్శనార్థం కొలువుదీర్చారు. ఉత్సవాల్లో భాగంగా మంగళశారం హంస వాహన సేవలు నిర్వహించనున్నారు.




గుత్తిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, అనంతపురం భాగ్యనగర్‌లో ఓటు అభ్యర్థిస్తున్న అనంత వెంకట్రామిరెడ్డి, ఉరవకొండలోని 5వ వార్డులో రోడ్డు షోలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ

# ఊపందుకున్న ప్రచారం




నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. మిగిలిన పార్టీల అభ్యర్థుల కంటే ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. ఇప్పటికే వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల మధ్య తిరిగిన అభ్యర్థులు తాజాగా ఎన్నికల నేపథ్యంలో మరోసారి ప్రజల వద్దకు చేరుకోవడంతో విశేష ఆదరణ లభిస్తోంది. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలవాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుందామంటూ ప్రజలకు అభ్యర్థులు పిలుపునిస్తున్నారు. – సాక్షి బృందం, అనంతపురం:


కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి మండలం మహంతపురంలో రోడ్డు షో నిర్వహిస్తున్న రంగయ్య


రాయదుర్గం నియోజకవర్గం ఉడేగోళంలో రోడ్డు షో నిర్వహిస్తున్న మెట్టు గోవిందరెడ్డి


శింగనమల నియోజకవర్గం నార్పల మండలం బి.పప్పూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వీరాంజనేయులు


తాడిపత్రిలోని టైలర్స్ కాలనీలో ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

## 'అనంత'లో టీడీపీకి భారీ షాక్

- ఎమ్మెల్యే అనంత సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మైనార్టీ విభాగం నగరాధ్యక్షుడు అజీజ్


పార్టీలో చేరిన అజీజ్, తదితరులతో ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

**అనంతపురం కార్పొరేషన్:** అనంతపురం నియోజకవర్గంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ఏళ్ల తరబడి టీడీపీలో పని చేసిన నాయకులు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారు. ఈ క్రమంలో కరుడు కట్టిన టీడీపీ వాదిగా పేరున్న ఆ పార్టీ మైనార్టీ విభాగం అనంతపురం నగరాధ్యక్షుడు అజీజ్ సోమవారం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీలో చేరారు. ఆయనతో పాటు అన్సర్, అహ్మద్, ముస్తఫా, మున్నీ, ముంతాజ్, ఇరజినబీ, షంషాద్, ఆయేషా, హసీనా, భాను, మాలిన్ తదితరులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి తన స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే అనంత సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ.. టీడీపీలో మైనార్టీలకు సరైన గుర్తింపు లేకుండా పోయిందన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వరప్రసాదమైన ముస్లిం రిజర్వేషన్‌ను రద్దు చేస్తామంటూ కేంద్ర మంత్రులు చెబుతున్నారని, అలాంటి బీజేపీతో పొత్తు పెట్టుకుని మరోసారి ముస్లింలను టీడీపీ పెద్దలు దారుణంగా వంచించారన్నారు. మతతత్వ పార్టీతో జత కట్టిన టీడీపీకి సరైన బుద్ధి చెప్పేందుకు ప్రతి ముస్లిమూ సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీలో ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం దక్కుతోందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి భాస్కరరెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజీఘర్ రిజ్వాన్, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్ పాల్గొన్నారు.

## పింఛన్ పంపిణీకి మార్గదర్శకాల జారీ



**అనంతపురం క్రైం:** ఎన్నికల నేపథ్యంలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 2,88,334 మంది సామాజిక భద్రతా పింఛన్ల లబ్ధిదారులు ఉండగా, వీరికి రూ.86.332 కోట్ల నగదును ఇప్పటి వరకూ ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటి వద్దకే అందజేస్తూ వచ్చింది. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ ప్రక్రియను టీడీపీ పెద్దలు అడ్డుకుని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ నెల పింఛన్‌ను సచివాలయాల వద్దనే అందజేశారు. ఈ క్రమంలో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ప్రభుత్వం మే, జూన్ మాసాలకు సంబంధించి పింఛన్ సొమ్మును నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేసింది. లబ్ధిదారుల్లో ఆధార్ అనుసంధానమైన వారి బ్యాంక్ ఖాతాల్లో నేరుగా డబ్బు జమ చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నారు. ఈ లెక్కన్న 2,02,716 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.60.815 కోట్ల మేర నగదు జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిగా మంచానికి పరిమితమైన వారితో పాటు నడవలేని స్థితిలో ఉన్న 85,618 మందికి 1నుంచి 5వ తేదీ లోపు ఇళ్ల వద్దకే అధికారులు వెళ్లి రూ. 25.517 కోట్లను పంపిణీ చేయనున్నారు. ఏదైనా కారణాల చేత పింఛన్ సొమ్ము అందకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, 3వ తేదీ లోపు ఇంటి వద్దకే వచ్చి సచివాలయ ఉద్యోగులు చేరుకుని నగదు అందజేస్తారని పేర్కొన్నారు.

### నీటి గుంతలో పడి వ్యక్తి మృతి


సురేష్ (ఫైల్)

**ధర్మవరం రూరల్:** నీటి గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలం కోనంపల్లికి చెందిన ఎరికల సురేష్ (40) ధర్మవరం మండలం వెంకటతిమ్మాపురంలో మంగళవారం జరిగే జ్యోతుల ఉత్సవానికి బంధువుల ఇంటికి వచ్చాడు. సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని నీటి గుంత వద్దకెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి పాచిలో చిక్కుకుని బయటకు రాలేక కొట్టుమిట్టాడసాగాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు సురేష్‌ని వెలికితీసి ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య గంగమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# వైఎస్ జగన్‌తోనే బీసీల అభ్యున్నతి


సమావేశానికి హాజరైన యాదవులు


మాట్లాడుతున్న మాలగుండ్ల శంకరనారాయణ

- యాదవుల ఆత్మీయ సమావేశంలో ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల

**గార్లదిన్నె:** రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి మొదలైంది సీఎం వైఎస్ జగన్ పాలనలోనే అని అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. గార్లదిన్నె మండలం కల్లూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం యాదవుల ఆత్మీయ సమావేశం జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహ, ఎమ్మెల్సీ మంగమ్మ, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారుడు ఆలూరి సాంబశివారెడ్డితో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలను దశాబ్దాలుగా కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తూ చంద్రబాబు ఘోరంగా అణచి వేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సామాజిక న్యాయం అంటే ఎలా ఉంటుందో ఆచరణలో చూపించిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. బీసీలకు 50 శాతం కంటే ఎక్కువ పదవులు కట్టబెట్టారన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతికి కూడా వైఎస్సార్‌సీపీ బాటలు వేసిందన్నారు. యాదవులకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించిన ఘనత కూడా వైఎస్సార్‌సీపీదేనన్నారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు రాజకీయంగా ఎదగాలన్నా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ గార్లదిన్నె మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బృందావన్ రామాంజనేయులు, మాబు, రవికుమార్, కేశవయ్య, చీమల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## వన్నూరుస్వామిపై దాడి అవాస్తవం

- తోపుదుర్తి ఘటనపై ఎస్పీని కలసి ఫిర్యాదు చేసిన గ్రామస్తులు


ఎస్పీ కార్యాలయం బయట మాట్లాడుతున్న తోపుదుర్తి గ్రామస్తులు

**ఆత్మకూరు:** మండలంలోని తోపుదుర్తిలో వన్నూరు స్వామి అనే వ్యక్తిపై భౌతిక దాడి జరిగిందనే అంశం అవాస్తవమని ఆ గ్రామస్తులు స్పష్టం చేశారు. సోమవారం రాత్రి తోపుదుర్తి గ్రామానికి చెందిన పలువురు ఎస్పీ అమిత్ బర్దర్‌ను ఆయన క్యాంప్ కార్యాలయంలో కలసి విషయాన్ని వివరించారు. రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్ర కుమార్ మాట్లాడుతూ... రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల కుటుంబం అరాచకాలను ప్రజలు ఎన్నటికీ మరువలేరన్నారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. ఈ క్రమంలో నియోజకవర్గ ప్రజలు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వైపు ఆకర్షితులయ్యారన్నారు. ఈ ప్రజాదరణను చూసి ఓర్వలేక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పరిటాల కుటుంబం మళ్లీ అలజడులకు తెరలేపిందన్నారు. ఎస్సీ, ఎస్టీలను అడ్డు పెట్టుకుని తోపుదుర్తి కుటుంబంపై, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులపై, నాయకులపై ఉసి గొలుపుతున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే వన్నూరప్పను సైతం ప్రలోభాలకు గురి చేసి కేసులు పెట్టించే ప్రయత్నం చేశారని వివరించారు. రాజకీయ లబ్ధి కోసం పరిటాల కుటుంబం సాగిస్తున్న కుట్రలను ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. గ్రామస్తులు ఓబులేసు, శాంతమ్మ, కొండన్న మాట్లాడుతూ... ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలని తోపుదుర్తి కుటుంబసభ్యులు చెప్పారని, అయితే గ్రామంలో ఎవరినీ వారు బెదిరించలేదని తెలిపారు. తమ కాలనీలో ఉండే మనిషిని కొడితే తామెందుకు ఊరికే ఉంటామన్నారు. వన్నూరుస్వామి వెనుక పరిటాల కుటుంబం ఉండి అనవసర రాద్ధాంతానికి తెరలేపిందని మండిపడ్డారు. తోపుదుర్తిలో అందరూ ప్రశాంతంగా, ఎంతో సఖ్యతతో ఉన్నారన్నారు. ఎస్పీ అమిత్ బర్దర్ సూచన మేరకు గ్రామంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిసేందుకు తామంతా సహకరిస్తామని పేర్కొన్నారు.

### ఉత్సాహంగా గాడిదల రేస్


గాడిదల రేస్‌లో దూసుకెళుతున్న రైడర్లు

**వజ్రకరూరు:** మండల కేంద్రంలో వెలసిన జనార్దన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం మండల రజక సంఘం ఆధ్వర్యంలో గాడిదల రేస్ నిర్వహించారు. పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి గాడిదలను యజమానులు తీసుకువచ్చారు. పోటీలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో వజ్రకరూరు జనసంద్రమైంది. ఉదయం జరిగిన గాడిదల పరుగు పందెంలో రైడర్ రాయదుర్గం మండలం మురడి గ్రామానికి చెందిన తిప్పయ్య ప్రథమస్థానంలో నిలిచారు. అలాగే గుమ్మఘట్ట మండలం రంగసముద్రం గ్రామానికి చెందిన రైడర్ మల్లేష్ రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. విజేతలను అభినందిస్తూ నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. అనంతరం గెలుపొందిన గాడిదలకు పూలహారాలు వేసి ఊరేగించారు. కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు సురేంద్ర, నాయకులు గురుమూర్తి, సురేష్, సునీల్, సుంకప్ప, మనోహర్, ధనుంజయ, గుండాలసుధ, శీనా పాల్గొన్నారు.

### రూ.4.70 లక్షల అపహరణ


నగదు ఎత్తుకెళ్లిన దుండగుడు (సీసీ కెమెరా ఫుటేజీ)

**రాయదుర్గం:** స్థానిక యూనియన్ బ్యాంక్ ఎదుట కాపు కాచి ఖాతాదారుడి నుంచి రూ.4.70 లక్షల నగదు అపహరించుకెళ్లిన ఘటన సంచలనం రేకెత్తించింది. బాధితుడు, పల్లెపల్లికి చెందిన రైతు తిప్పారెడ్డి తెలిపిన మేరకు... వివిధ అవసరాల నిమిత్తం సోమవారం యూనియన్ బ్యాంక్‌లోని తన ఖాతా నుంచి రూ.4.70 లక్షల నగదు విత్ డ్రా చేసి, బ్యాంక్ ఎదుట నిలిపిన స్కూటీలో భద్రపరిచి, లాక్ చేశాడు. ఇంతలో పంట రుణాల అంశం గుర్తుకు రావడంతో మళ్లీ బ్యాంక్‌లోకి వెళ్లాడు. అప్పటికే అక్కడ కాపు కాసిన దోపిడీ ముఠా సభ్యులు స్కూటీ చుట్టు నిలుచుకోగా, టోపీ పెట్టుకున్న ఓ యువకుడు స్కూటీ సీటు బలంగా లాగి క్షణాల్లో నగదు బయటకు తీశాడు. అనంతరం అక్కడి నుంచి దుండగులు ఉడాయించారు. కాసేపటి తర్వాత బయటకు వచ్చిన రైతు తిప్పారెడ్డి స్కూటీ సీటు పైకి లేపి ఉండడం గమనించి నగదు చోరీ చేసినట్లు గుర్తించి, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ శ్రీనివాసుల ఆధ్వర్యంలో సిబ్బంది బ్యాంక్ వద్దకు చేరుకుని సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### డైట్ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**కొత్తచెరువు:** డైట్‌సెట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ మీనాక్షి తెలిపారు. రెండేళ్ల డీఎడ్ కోర్సు చేసేందుకు ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు మే 5వ తేదీలోపు https://apdeecet.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### పరిటాల కుటుంబంతో ప్రాణహాని

**పుట్టపర్తి టౌన్:** పరిటాల కుటుంబం నుంచి తనకు ప్రాణహాని ఉన్నందున రక్షణ కల్పించాలని ఎస్పీ మాధవరెడ్డిని రామగిరి వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్ కోరారు. సోమవారం పుట్టపర్తిలోని పోలీస్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డితో కలసి ఆయన ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. పరిటాల కుటుంబ ప్రలోభాలకు తలొగ్గి ఇటీవల టీడీపీలో చేరానని, అయితే ఆ పార్టీ తీరు నచ్చక తిరిగి తోపుదుర్తి సోదరుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. ఇది జీర్ణించుకోలేక తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి కార్లపై రాళ్లు, కర్రలతో దాడులకు పాల్పడి వర్గ కక్షలకు ఆజ్యం పోస్తున్నారన్నారు. పరిటాల కుటుంబం నుంచి తగిన రక్షణ కల్పించాలని కోరారు.

## ఘనంగా గిరిజన గ్రామోత్సవం


కలశాలను తీసుకెళుతున్న బంజారా యువతులు

**బెళుగుప్ప:** మండల పరిధిలోని బెళుగుప్ప తండాలో సోమవారం గిరిజన గ్రామోత్సవం ఘనంగా జరిగింది. వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలతో గ్రామీణ ప్రాంతాలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ సంత్ సేవాలాల్, మరియమ్మ దేవరను ఘనంగా నిర్వహించారు. తమ ఆచారంలో భాగంగా గంగపూజ చేశారు. ప్రతి మూడేళ్లకు ఓసారి ఈ తరహా గ్రామోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గంగపూజ నిర్వహణకు ముందు తండా నుంచి బెళుగుప్పలోని రామేశ్వరాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి 101 కలశాల్లోకి గంగాజలాన్ని కన్యలు నింపి, పూజలు చేశారు. అనంతరం కలశాలను తలపై మోస్తూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ గ్రామోత్సవంలో మొదటిరోజు పూజలు అభిషేకాలు, రెండవరోజు మంగళవారం జంతు బలి కార్యక్రమాలు ఉంటాయి.

## క్లుప్తంగా

### గ్రాడ్యుయేషన్ డే సందడి


గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు

**అనంతపురం సెంట్రల్:** నగరంలో నేతాజీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ లలితమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య, పిల్లలకు పీపీ-1, పీపీ-2 సిలబస్ పుస్తకాలు, ప్రీ స్కూల్ మెటీరియల్ అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్ నిర్మల, హెల్పర్ సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### అర్జాస్ స్టీల్స్ ఔదార్యం

- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఎండోస్కోపి వితరణ


వైద్యాధికారులకు ఎండోస్కోపి పరికరం అందజేస్తున్న దృశ్యం

**అనంతపురం మెడికల్:** సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి తాడిపత్రి అర్జాస్ స్టీల్స్ ఎండోస్కోపి అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సోమవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడారు. రోగుల సహాయార్థం అర్జాస్ స్టీల్స్ పరికరం అందజేయడం అభినందనీయమన్నారు. ఇదే తరహాలో స్వచ్ఛంద సంస్థలు, తదితర ప్రముఖులు ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, న్యూరోసర్జన్ డాక్టర్ భాస్కర్, ఎండోగైనాలజిస్టు డాక్టర్ బ్రహ్మానందం, కార్డియాలజిస్టు డాక్టర్ సుభాష్ చంద్రబోస్, సర్జికల్ గ్యాస్ట్రో డాక్టర్ ప్రణీత్, అర్జాస్ స్టీల్స్ రంజన్ ఠాకూర్, నరేందర్, సెంథిల్ లక్ష్మీనారాయణ, ఆలంబన జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

### నందమూరి నగర్‌లో జోరుగా ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న తోపుదుర్తి శైలజారెడ్డి

**రాప్తాడు రూరల్:** హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంత, రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి మద్దతుగా సోమవారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని నందమూరి నగర్‌లో తోపుదుర్తి శైలజారెడ్డి ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించాలని కోరారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటే ప్రతి పేద కుటుంబమూ మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు గంగుల భానుమతి, మండల కన్వీనర్ కే. రాధమ్మ, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనుంజయ యాదవ్, సర్పంచ్ తేజస్విని, ఎంపీటీసీ వడ్డే శీనా, వార్డు మెంబర్లు సుకుమార్, రామస్వామి, నాయకులు చిన్నపరెడ్డి, షేక్ పర్వానా, నాగేంద్రప్రసాద్, సుంకన్న, రమేష్ యాదవ్, మైకేల్, వడ్డే ప్రసాద్, సూరి యాదవ్, గోపాల్, రాము, గోవర్ధన్, లోకేష్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే అనంత కుటుంబ సభ్యుల ప్రచారం


5వ డివిజన్‌లో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత కుటుంబ సభ్యులు

**అనంతపురం కార్పొరేషన్:** నగరంలోని 5వ డివిజన్‌లో సోమవారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులు అనంత నవ్యతా, అనంత సువర్ణ, అనంత మేఘన, అనంత నందిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో నగరం ఏవిధంగా ఉండేదని, ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధికి వ్యత్యాసం చూడాలన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతాయన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నగరం రూపురేఖలు మారిపోయాయన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్ జయలలిత, నాయకులు పవన్‌కుమార్ రెడ్డి, కృష్ణం రఘు, ఉదయ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకురాళ్లు సావిత్రమ్మ, కృష్ణవేణి, తేజస్విని, కవి, ఉష, ఇమ్రాన్, రాజుకుళ్లాయప్ప, మారుతీ పాల్గొన్నారు.

# 'అనంత'లో కేన్సర్ ఆస్పత్రిని విస్తరిస్తాం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 2వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'


2వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


భగత్ సింగ్ నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం కార్పొరేషన్:** సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అనంతపురంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేసేలా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయడం జరిగింది. అందులో భాగంగానే మరోసారి అధికారంలోకి రాగానే అనంతపురంలోని కేన్సర్ ఆస్పత్రిని మరింత విస్తరించి కేన్సర్ బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అనంత హామీ ఇచ్చారు. సోమవారం నగరంలోని 2వ డివిజన్ భాగ్యనగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనంతపురం సర్వజనాస్పత్రిలో మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. వేల సంఖ్యలో వైద్యులు, స్టాఫ్‌నర్సు పోస్టులు భర్తీ చేయడం జరిగిందన్నారు. ఏడు స్పెషాలిటీ సేవలతో ఉమ్మడి జిల్లా ప్రజలకు వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు.

**అర్హులందరికీ ఇళ్ల పట్టాలు..**

రానున్న రోజుల్లో ఇళ్లు లేని వారందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణాలు చేపట్టేల చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని జిల్లా కేంద్రాలను అభివృద్ధి చేయడం కోసం మేనిఫెస్టోలో రూ.2 వేల కోట్లు కేటాయిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న విషయాన్ని తెలియజేశారు. తొలి దశలోనే జిల్లా కేంద్రానికి నిధులు తీసుకువచ్చి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మేధావులు, పట్టభద్రులు, అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ అనంతపురం, హిందూపురం నియోజకవర్గాల డిప్యూటీ రీజినల్ కో-ఆర్డినేటర్ రాగే పరుశురాం, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, కార్పొరేటర్లు బోయ నాగమణి, కమల్‌భూషణ్, ఇసాక్, సుమతి, లక్ష్మి, దేవి, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, చింతకుంట మధు, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎగ్గుల శ్రీనివాసులు, హుస్సేన్ పీరా, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, కృష్ణవేణి, నాయకులు కృష్ణమూర్తి, అనిల్‌కుమార్ గౌడ్, వనారస బలారం, జావెద్, కేశవరెడ్డి, చెన్నారెడ్డి, రవి, ఏ1రఫి, పుల్లయ్య, చంద్రయాదవ్, హనుమంతు, తనీష, ఇసాక్, ఆసిఫ్, దేవి, శోభాబాయి, భారతి, రాజేశ్వరి, పార్వతి, ఉష, రాధాయాదవ్ పాల్గొన్నారు.

**విశ్వసనీయతకు పట్టం కట్టండి**

**అనంతపురం రూరల్:** గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీలన్నీ అమలు చేశాం రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాం. అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రజలను కోరారు. సోమవారం రాజీవ్‌కాలనీ పంచాయతీ పరధిలోని లీలమ్మకాలనీ, మహదేవనగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. 2014 ఎన్నికల్లో అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రజలను ఏవిధంగా మోసం చేశారో వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆశాబీ, ఎంపీటీసీ సంధ్య, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, బీసీ సెల్ నాయకులు అనిల్‌కుమార్ గౌడ్, అంజి, దౌలా పాల్గొన్నారు.

**నేడు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ..**

**అనంతపురం కార్పొరేషన్:** అనంతపురం రూరల్ పరిధిలోని టీవీ టవర్ మెయిన్ రోడ్డులో మంగళవారం ఉదయం 6 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం జరగనుంది. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఎమ్మెల్యే అనంత ఓ ప్రకటనలో కోరారు.

### టీడీపీకి ఎదురుదెబ్బ


ఎమ్మెల్యే అనంత సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన రాంబాబు, టీడీపీ నాయకులు

అనంతపురం నియోజకవర్గంలో టీడీపీకి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇటీవల కాలంలో రోజు రోజుకు వలసల సంఖ్య పెరుగుతోంది. టీడీపీ తెలుగు యువత అధికార ప్రతినిధి శిరిశాల రాంబాబు టీడీపీకి గుడ్‌బై చెప్పారు. 2వ డివిజన్‌లోని బిందెలకాలనీలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. శిరిశాల రాంబాబుతో పాటు కదిరప్ప, లక్ష్మణ్ణ, కబాలి, సుధాకర్, శంకరప్ప, జమ్మయ్య, నారాయణ స్వామి, లేపాక్షి, సాయి, జాను, రమేష్, కుళ్లాయప్ప, సుబ్బాల్, బాషా, అంజి తదితరులు చేరిరు. కార్యక్రమంలో అనంతపురం, హిందూపురం నియోజకవర్గాల డిప్యూటీ రీజినల్ కో-ఆర్డినేటర్ రాగే పరుశురాం, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ల కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్ బోయ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

### చియ్యేడులో నాయకుల ప్రచారం


వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతున్న నాయకులు

**రాప్తాడురూరల్:** అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామంలో వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో హిందూపురం ఎంపీ అభ్యర్థిని బోయ శాంత, రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి మద్దతుగా సోమవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామంలో జరిగిన అభివృద్ధి, ప్రతి ఇంటికీ జరిగిన సంక్షేమాన్ని తెలియజేస్తూ ఓట్లు అభ్యర్థించారు. పేద ప్రజల అభివృద్ధిని కాంక్షించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, గవ్వల రామకృష్ణ, రవీంద్రారెడ్డి, చలపతి, నవీన్ కుమార్‌రెడ్డి, వడ్డే రామకృష్ణ, బి.రామకృష్ణ, దేవర బయన్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రామ్మోహన్ రెడ్డి, అలీసాబ్, బూత్ కన్వీనర్ రామకృష్ణ, కె.రాజారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

### చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు

**అనంతపురం కార్పొరేషన్:** నెల్లూరు పర్యటనలో చంద్రబాబు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మేయర్ వసీం ధ్వజమెత్తారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చంపితే ఏమవుతుందని చంద్రబాబు వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టేలా చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్నారన్నారు. ఓటమి భయంతోనే ఆయన కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. మరోసారి రాష్ట్ర ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కార్‌కు అండగా నిలవబోతున్నారన్నారు.

### అక్రమ రవాణాపై గట్టి నిఘా

**అనంతపురం:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, నగదు, ఇతర ఉచిత తాయిలాలు అక్రమ రవాణా కాకుండా పోలీసులు పకడ్బందీగా తనిఖీ చేపట్టారు. అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివా రెడ్డి ఆధ్వర్యంలో ఇటుకలపల్లి సర్కిల్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఓటర్లను ప్రలోభపెట్టడానికి తరలించే ఎటువంటి వస్తువులైనా సీజ్ చేసి చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ తెలిపారు. ఇటుకలపల్లి ఎస్ఐ రాఘవేంద్ర రెడ్డి, స్పెషల్ పార్టీ, బీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రశాంతంగా నామినేషన్ల ఉపసంహరణ

**రాప్తాడు:** రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సోమవారం ముగిసింది. 7 మంది ప్రధాన పార్టీల అభ్యర్థులు, 6 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో నిలిచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులు పోతుల నాగరాజు, రఘురామయ్య నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారు. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. ఆది ఆంధ్ర శంకరయ్య (కాంగ్రెస్) హస్తం గుర్తు, అంజయ్య (బహుజన్ సమాజ్ పార్టీ) ఏనుగు గుర్తు, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ) ఫ్యాన్ గుర్తు, పరిటాల సునీతమ్మ (టీడీపీ) సైకిల్ గుర్తు, మల్లికార్జున (ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ) విజిల్ గుర్తు, బి.నరేష్ (నవరతం పార్టీ) గ్లాస్ టంబ్లర్ గుర్తు, కే.నరేష్ (జై భీం రావు భారత్ పార్టీ) కోట్ గుర్తు కేటాయించగా.. స్వతంత్ర అభ్యర్థులు విజయ్ కుమార్‌కు పెండులం, రామాంజికి జావెలిన్ విసరడం, రవివర్మకు కూలర్, రాజశేఖర్‌కు కెమెరా, వెంకట రాముడికి ఎయిర్ కండీషనర్, రాజేష్‌కు స్విచ్ బోర్డు కేటాయించారు.

## బాల్య వివాహాలు చేయడం నేరం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ బి.ఎన్.శ్రీదేవి

**రాప్తాడు:** బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం. బాల్య వివాహాలు చేసి బాలికల జీవితాలను నాశనం చేయవద్దని ఐసీడీఎస్ పీడీ బి.ఎన్.శ్రీదేవి పేర్కొన్నారు. సోమవారం రాప్తాడులో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదరికం, ఇతర ఇబ్బందులతో తల్లిదండ్రులు ఆడ పిల్లలను భారంగా చూడొద్దన్నారు. బాల్య వివాహాల నిర్మూలనను అందరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లలోపు వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలు చేసిన వారికి రూ.లక్ష జరిమానాతో పాటు రెండేళ్లు జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు.

**ఆట పాటలతో విద్యను బోధించాలి**

రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడీ కేంద్రాల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించింది. చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణంలో ఆటపాటలతో కూడిన విద్యా బోధన చేయాలని పీడీ బి.ఎన్. శ్రీదేవి అన్నారు. చిన్నారుల జీవితంలో మొదటి ఆరేళ్లు ఎంతో విలువైనవని, మూడేళ్ల వరకూ తల్లి ఒడికే పరిమితమయ్యే పిల్లలు తర్వాత బయట ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నాలు మొదలు పెడతారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీతోనే ఇంటింటా సంక్షేమం


ఓటు అభ్యర్థిస్తున్న తోపుదుర్తి నయనతారెడ్డి

**ఆత్మకూరు:** ఆత్మకూరులో సోమవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు తోపుదుర్తి నయనతారెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. తొలుత ఆమె మండల కేంద్రానికి రాగానే మహిళలు హారతులు ఇస్తూ బ్రహ్మరథం పట్టారు. ప్రతి ఇంట్లో ఘనంగా స్వాగతం పలికారు. యువకులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. పటాసులు పేల్చి సందడి చేశారు. అనంతరం నయనతారెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీతోనే ఇంటింటికీ సంక్షేమం సాధ్యం. పథకాలన్నీ అందాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైస్ ఎంపీపీ నీలిమ, విజయ్, నాయకులు సుభద్రమ్మ, పార్వతమ్మ, చిన్నక్క, వన్నూరప్ప, నాగరాజు, బాలపోతన్న, వాసుదేవరెడ్డి, ముత్యాలు, శ్రీధర్, తైదుల శివారెడ్డి, జయరామిరెడ్డి, చెన్నారెడ్డి, నాగభూషణం రెడ్డి, వెంకటేష్, పెదయ్య, సుధాకర్ రెడ్డి, చిన్నరెడ్డి, సుధీర్‌రెడ్డి, ఎర్రిస్వామి, మల్లన్న, వెంకట్రాముడు, ముత్యాల రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, ఓబీ టైలర్ వెంకటేష్, దామోదర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శ్రీరామ్, రామాంజి, సురేష్, కల్యాణ్, రామునాయక్, కృష్ణానాయక్, గంగాధర్ రెడ్డి, శ్రీరాములు, మురళి, పెద్దన్న, తరుణ్, రాజశేఖర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీగా ఆశీర్వదించండి


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ

**రాప్తాడు:** ఈ ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే రాప్తాడు మండలంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బోయ శాంతమ్మ అన్నారు. సోమవారం ఆమె రాప్తాడులో పర్యటించారు. రాప్తాడులో తన సామాజిక వర్గం (వాల్మీకులు), ఇతర సామాజిక వర్గం వారిని కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఎంపీగా గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. హిందూపురం ఎంపీ అభ్యర్థిగా 28 ఏళ్ల అనంతరం ఒక బోయ సామాజిక వర్గానికి సీఎం జగన్ సీటు కేటాయించడం హర్షనీయమన్నారు. దీనిపై వాల్మీకులు కూడా చాలా సంతోషంగా ఉన్నారన్నారు. రాప్తాడు ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఎంపీగా తనను మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఆగ్రోస్ కేశవ రెడ్డి, లాయర్ వాల్మీకి హరి, వేపకుంట రామలింగమయ్య, మాస్లుకోసే రాము, రాజశేఖర్, ఎల్ఐసీ వెంకటరాముడు, మారుతి, రేనాటి శ్రీనివాస్, జింకల రామాంజినేయులు, వాల్మీకి ధనుంజయ, తలారి నాగరాజు, మూర్తి, ఇటుకులపల్లి చిరంజీవి, రవికుమార్ పాల్గొన్నారు.

## డాక్టర్ పద్మావతి సేవలు అమూల్యం


డాక్టర్ పద్మావతి, డాక్టర్ రామ సుబ్బారావును సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

**అనంతపురం మెడికల్:** ప్రభుత్వ సర్వజనాస్పత్రి కంటి వైద్య విభాగం ప్రధాన విభాగాధిపతిగా ఉంటూ ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ పద్మావతి సేవలు మరువలేనివని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో డాక్టర్ పద్మావతి ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పద్మావతి, ఆయన భర్త విశ్రాంత డీఎంహెచ్ఓ డాక్టర్ రామసుబ్బారావును సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శారోన్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, హెచ్ఓడీలు డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ నవీన్ కుమార్, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీని వీడిన నాయకులు




వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో తోపుదుర్తి చందు, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి

**ఆత్మకూరు:** ఆత్మకూరుకు చెందిన టీడీపీ నాయకులు పరెడ్డి నాగిరెడ్డి, మేదర రామన్న వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వీరికి వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానిచారు. అనంతరం పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలపోతన్న, వెంకట్రాముడు, శివారెడ్డి, ఫణిరెడ్డి, చెన్నారెడ్డి, రాజశేఖర్, నాగభూషణం రెడ్డి, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

**రాప్తాడురూరల్:** అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్‌కు చెందిన టీడీపీ నాయకులు కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో వడ్డే రామాంజనేయులు, బోయ పవన్, నాగార్జున రెడ్డి, ఎరికల గంగాధర్, ఎరికల మహేష్ టీడీపీకి గుడ్‌బై చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చందు వీరికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. హిందూపురం ఎంపీ అభ్యర్థిని బోయ శాంత, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ శీనా, వార్డు మెంబర్ అన్ను, రెడ్డప్ప, బాషా, సాయికృష్ణ, సూరి, సునీల్, శివ తదితరులు పాల్గొన్నారు.

### రాప్తాడు అసెంబ్లీ బరిలో 13 మంది


ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

**కనగానపల్లి:** రాప్తాడు అసెంబ్లీ నియోజవర్గం నుంచి 13 మంది అభ్యర్థులు సార్వత్రిక ఎన్నికల పోటీలో నిలిచారు. సోమవారం నామినేషన్ల ఘట్టం ముగిసిన తర్వాత సాయంత్రం 5 గంటలకు ఆర్వో వసంతకుమార్ రాప్తాడు అసెంబ్లీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. రాజకీయ పార్టీల నుంచి 7 మంది అభ్యర్థులు, స్వతంత్ర (ఇండిపెండెంట్) అభ్యర్థులు మరో 6 మంది పోటీలో ఉన్నట్లు ఆర్వో తెలిపారు. వీరిలో గుర్తింపు పొందిన ప్రధాన రాజకీయ పార్టీలు జాతీయ కాంగ్రెస్, బహుజన సమాజ్ పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీకి చెందిన అభ్యర్థులతో పాటు గుర్తింపు పొందని ఆల్ ఇండియా కిసాన్ జనతా, జై భీం రావు, నవతరం పార్టీలకు చెందిన మరో ముగ్గురు పోటీలో ఉన్నారు. వీరితో పాటు మరో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచారు.

**అనంతపురం అర్బన్ అసెంబ్లీ బరిలో 15 మంది**

**అనంతపురం రూరల్:** అనంతపురం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల బరిలో 15 మంది నిలిచారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే నాటికి 28 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలనలో 7 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ సోమవారం నాటికి ముగియడంతో 6 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు నిలిచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గ్రంధి వెంకటేష్ తెలిపారు. అనంతపురం అసెంబ్లీ బరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అనంత వెంకటరామిరెడ్డితో పాటు మరో 14 మంది ఎన్నికల బరిలో నిలిచారు.

### సజావుగా పింఛన్ల పంపిణీకి చర్యలు

**అనంతపురం కార్పొరేషన్:** నగరంలో సజావుగా పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటామని కమిషనర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 23,497 పింఛన్లు ఉండగా.. అందులో 16,238 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు లింక్ అయినట్లు తెలిపారు. వీరికి పింఛన్ సొమ్ము బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుందన్నారు. మిగిలిన 7,259 మంది పింఛన్ లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి సొమ్ము అందజేస్తారన్నారు. పింఛన్‌దారులెవరూ సచివాలయం వద్దకు వెళ్లాల్సిన పని లేదన్నారు. ఈనెల 1వ తేదీన ఏ కారణం చేతైనా పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాకు జమ కాకపోతే ఈనెల 3వ తేదీన ఇంటి వద్దకే పింఛన్ పంపిణీకి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### సంగీత పరికరాలపై ఉచిత శిక్షణ

**అనంతపురం కల్చరల్:** సంగీత పరికరాలపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎల్కేపీ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి పద్మజ తెలిపారు. మే 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు స్థానిక లలితా కళా పరిషత్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాంప్రదాయ నృత్యాలకు విజయ్ కుమార్, వయోలిన్ కీబోర్డ్ వాయిద్య సహకారాలకు నందుమార్, సాంఘిక పౌరాణిక నాటకాల్లో పాత్రలపై పరిషత్ కళాకారులు శిక్షణ ఇస్తారన్నారు. మే 1వ తేదీలోపు పేర్లను లలితా కళాపరిషత్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 8121171108, 9390944502 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం



ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న నాయకులు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఎస్ ఎస్సీ కాలనీ( 6వ వార్డు)లో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా ప్రచారాన్ని నిర్వహించారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, జిల్లా నాయకుడు బళ్లారి రాజ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, కౌన్సిలర్ వరదరాజులు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గుంతకల్లు ఎమ్మెల్యేగా వెంకటరామిరెడ్డి, ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఖాజాఖాన్, ప్రియాంక, సన్నీ, మస్తాన్, షాకీర్, హరినాథ్‌రెడ్డి, భాస్కర్, అరుణ్, అంగడి వలి, హరి పాల్గొన్నారు.

### చెక్ పోస్టులో గట్టి నిఘా ఉంచాలి

విడపనకల్లు: మండలంలోని 67,42వ రహదారులో ఆంధ్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో నిఘా ఉంచాలని సిబ్బందిని డీఎస్పీ శివ భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం డీఎస్పీ చెక్ పోస్టులను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎస్‌ఐ ఖాజాహుస్సేన్, చెక్ పోస్టు సిబ్బంది పాల్గొన్నారు.

### కనుల పండువగా వసంతోత్సవం



వసంతోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండల కేంద్రంలో జనార్దన వేంకటేశ్వరస్వామి వసంతోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం పల్లకీసేవ, వసంతోత్సవం నిర్వహించారు.

### 'నేర చరితులను చిత్తుగా ఓడించండి'

గుంతకల్లు: నేర చరిత్ర కలిగిన వారికి ఓటు వేయకుండా ప్రజల బాగోగులు గురించి ఆలోచించే వైవీఆర్ లాంటి వారికి మద్దతుగా నిలవాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఓటు ద్వారా గుంతకల్లు నియోజకవర్గాన్ని రక్షించుకోవాలని సూచించారు. ఒక్క ఓటు ఐదు సంవత్సరాలు గుంతకల్లు నియోజకవర్గ ప్రజల భవిష్యత్‌ను వ్యక్తిగత జీవితాన్ని శాసిస్తున్నదన్న విషయాన్ని గుర్తుంచుకుని మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యేగా వైవీఆర్ పట్టం కడదామని విజ్ఞప్తి చేశారు.

### చంద్రబాబుపై చర్యలు తీసుకోండి



ఎస్‌ఐ నరేష్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వజ్రకరూరు: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడిపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు కోరారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ నరేష్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెంలో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో చంద్రబాబునాయుడు ప్రజలను రెచ్చగొట్టెలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా వ్యాఖ్యలు చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి, ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడారన్నారు. కార్య క్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఉస్మాన్, మండల కార్యదర్శి నల్లబోతులరాజు, పంచాయతీ వార్డు సభ్యుడు అచ్చనాల మధుసూదన్, సీనియర్ నాయకుడు వైద్యనాథరెడ్డి, ఉపాధ్యక్షుడు రాకెట్ల బాబు, కిసాన్ సెల్ నాయకులు రఘుపతి, ఎస్టీసెల్ మండల కార్యదర్శి రామ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### డ్రైవర్‌కు గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం నీళ్ల ట్యాంకర్‌ను లారీ వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ రాజు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. కొత్తపేట శివారులో జాతీయ రహదారి మధ్య డివైడర్‌లో ఉన్న మొక్కలకు నీరు పోసేందుకు నీళ్ల ట్యాంకర్‌ను నిలిపారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల్ నుంచి అనంతపురం నగర శివారులోని వడియం పేటకు ఖాళీ సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న లారీ వెనుక నుంచి వచ్చి నీళ్ల ట్యాంకర్‌ను ఢీకొంది. ప్రమాదంలో లారీలో ఇరుక్కుని శింగనమలకు చెందిన లారీ డ్రైవర్ రాజు తీవ్రంగా గాయపడ్డాడు. సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్‌ఐ నబీరసూల్ సంఘటనా స్థలానికి వెళ్లి తీవ్రంగా డ్రైవర్ రాజును గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# బాబు హామీలు కాగితాలకే పరిమితం

- ఆయన మాటలు నమ్మి మోసపోవద్దు
- వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం
- ప్రచార సభల్లో ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి



ఉరవకొండలో ప్రచారం చేస్తున్న విశ్వేశ్వరరెడ్డి



బెళుగుప్ప మండలం శ్రీరంగాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ

బెళుగుప్ప: చంద్రబాబు ఇచ్చే మోసపూరిత హామీలు ఎవరూ నమ్మొద్దండి.. ఆయన మాటలు కాగితాలకే పరిమితమని ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బూదవర్తి, శ్రీరంగాపురం గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వకు అపూర్వ స్వాగతం లభించింది. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి ఎక్కడా కనిపించదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో 2,500 కోట్లతో సంక్షేమం, మరో వెయ్యి కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి, అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రభుత్వానికి అండగా నిలిస్తే రెట్టింపు సంక్షేమం, అభివృద్ధి అందిస్తామని హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోలో అమలుకు సాధ్యం అయ్యే వాటిని మాత్రమే చెప్పారని, చెప్పినవన్నీ వందశాతం అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సాహితిరెడ్డి, రామిరెడ్డి, ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప, ఎంపీటీసీ వరలక్ష్మి, మండల కన్వీనర్ మచ్చన్న, శ్రీనివాస్, నాగిరెడ్డి, మారుతీరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, దానయ్య, శివన్న, చక్రధర్, ఈశ్వర్, రాజశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, లోకేష్ రెడ్డి, హనంత్‌రెడి పాల్గొన్నారు.

**ఉరవకొండలో విశ్వేశ్వరరెడ్డి విస్తృత ప్రచారం**

ఉరవకొండ: పట్టణంలోని 5, 6 వార్డుల్లో ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం విస్తృతంగా చేపట్టారు. ముందుగా మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీకి ప్రతి ఒక్కరూ అండగా నిలబడి ఫ్యాన్ గుర్తుకు రెండుసార్లు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ప్రచార రథంపై ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తు రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, పార్టీ నాయకులు తలారి శ్రీనివాసులు, విశ్రాంత ఎఎస్‌ఐ శ్రీరాములు, గాదిలింగ, హరి, కర్ణ, ఉరవకొండ పీఏసీఎస్ వడ్ల షేక్షావలి, వశికేరి మల్లి, జీకే సుబ్బలక్ష్మి, ఆసీఫ్, కురుబ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి.. వైవీఆర్‌ను గెలిపించండి



25వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి



11వ వార్డులో ఓటు అభ్యర్థిస్తున్న మైమూన్, ఎమ్మెల్యే చిన్నకుమార్తె నిషితారెడ్డి

గుంతకల్లుటౌన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని 25వ వార్డులో ఆమె ఇంటింటికీ వెళ్లి జగనన్న ఆవిష్కరించిన ఎన్నికల మేనిఫెస్టో ద్వారా జరగబోయే మేలును వివరించారు. నియోజకవర్గంలో శాశ్వతంగా నిలిచిపోయేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన వైవీఆర్ ఎమ్మెల్యేగా, ఎంపీగా శంకర్‌నారాయణను గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్ మాబు, వార్డు నాయకులు ఎం.వెంకటరెడ్డి, దశరథరెడ్డి, తిమ్మారెడ్డి, దేవేంద్రప్ప, శరణ బసిరెడ్డి, వడ్డేమోహన్, ధనుంజయ, రఘు, రామంజి, తదితరులు పాల్గొన్నారు. అలాగే 32వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అంజి, ఖాజావలి, దేవేంద్రనాయక్, చాంద్‌పీరా, రహిమాన్, సుబ్బారావు, డిష్‌మాబు, డిష్‌ఖాజా, మల్లయ్య, షమీమ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా 11వ వార్డులో కౌన్సిలర్ కె.నీలావతి ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్, ఎమ్మెల్యే చిన్న కుమార్తె నిషితారెడ్డి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ మార్కెట్ వెంకటేష్, దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.హొన్నూర్‌వలి, కోఆప్షన్‌సభ్యుడు రాజశేఖర్, నాయకులు ఖలీల్, షాబుద్దీన్, నాగరాజు, డిష్ రాము, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి క్రికెట్ కోచింగ్ క్యాంప్

గుంతకల్లుటౌన్: వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని ఆర్డీటీ ఆధ్వర్యంలో మే 1 నుంచి ఉచిత క్రికెట్ కోచింగ్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు హరినాథ్‌గౌడ్, ఆర్డీటీ కోచ్ ఇనాయతుల్లా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌జేపీ హైస్కూల్‌లో శిక్షణ ఉంటుందని, ఆసక్తి కలిగిన 7 నుంచి 16 సంవత్సరాల వయస్సు కలిగిన బాల బాలికలు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9701435534 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

## వలంటీర్ల రాజీనామా

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లికి చెందిన ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సోమవారం ఎంపీడీఓ శ్రీనివాసులుకు అందజేశారు. అనంతరం వలంటీర్లు సురేష్, మురళి, వంశీ, మంజునాథ్, నరేష్, బ్రహ్మ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డి, ఎంపీగా శంకర్‌నారాయణకు మద్దతుగా ప్రచారంలో పాల్గొనేందుకు రాజీనామా చేశామన్నారు.

వజ్రకరూరు: మండలంలోని చిన్నహోతురుకు చెందిన వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. వలంటీర్లు లావణ్య, సుజాత, రాధ, మహాలక్ష్మి,ఈశ్వర్ తదితరులు రాజీనామా లేఖలను ఎంపీడీఓ విజయలలితకు అందించారు.

## పైపులైన్ మరమ్మతు పనులు పూర్తి

కూడేరు: మండలానికి తాగునీరు సరఫరా చేసే తాగునీటి ప్రాజెక్ట్ పైపులైన్‌కు మరమ్మతులు పూర్తయ్యాయి. దీంతో గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యింది. పైపులైన్ వద్ద వాల్వ్ దెబ్బతినడంతో వెంటనే మరమ్మతులు చేయించినట్లు సూపర్‌వైజర్ మంజునాథరెడ్డి తెలిపారు.

## క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ తప్పనిసరి

కూడేరు: ఉపాధి పనులను క్షేత్ర స్థాయిలో తప్పనిసరిగా పర్యవేక్షించాలని డ్వామా ఏపీడీ విజయలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం గొటుకూరు గ్రామంలో ఉపాధి పనులను ఆమె పరిశీలించారు.

## నేడు వైవీఆర్ ప్రచారం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు, టి.కొత్తపల్లి, వన్నేదొడ్డి, శ్రీపురం గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ప్రచారానికి వస్తున్నట్లు ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు తొండపాడు గ్రామం నుంచి ప్రచారం ప్రారంభం అవుతుందన్నారు. జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## వాహనాల తనిఖీ

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డు, అనంతపురం రోడ్డు, కర్నూలు రోడ్డులో సోమవారం సీఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్‌ఐ నబీరసూల్, సిబ్బంది నాగమాణిక్యం, ఆజాద్, హనుమంతు, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని ధర్మాపురానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుడు సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీకాంత్ కొన్ని రోజులుగా కుటుంబసమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్న శ్రీకాంత్‌ను గమనించిన కుటుంబసభ్యులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## వైఎస్సార్‌సీపీతోనే ఉరవకొండ అభివృద్ధి

- యువనేత ప్రణయ్‌రెడ్డి



పాల్తూరులో రోడ్డు షో నిర్వహిస్తున్న యువజన నేత ప్రణయ్‌రెడ్డి

విడపనకల్లు: వైఎస్సార్‌సీపీతోనే ఉరవకొండ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని యువనేత ప్రణయ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాల్తూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి గెలుపే లక్ష్యంగా ఆయన తనయుడు వై.ప్రణయ్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. పాల్తూరులోమెయిన్ బజారు, ఎస్సీ,బీసీ, అగ్గినగర్, ఇంద్రానగర్, పోలీస్ స్టేషన్, దూదేకుల, వడ్డే కాలనీలో ఆయన ప్రచారం చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు విశ్వేశ్వరరెడ్డి, శంకరనారాయణను గెలిపించాలని కోరారు. మెయిన్ బజారు గుండా రోడ్ షో నిర్వహించారు. అనంతరం మెయిన్ బజారులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రణయ్‌రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీకి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందన్నారు. నియోజకవర్గ ప్రజలు పయ్యావుల కేశవ్‌ను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించినా, ఏనాడూ ప్రజా సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఆయన సొంత సామాజిక వర్గానికి చెందిన వారికి మాత్రమే దోచిపెట్టాడన్నారు. కార్యక్రమంలో సర్పంచు బీవాలరాణి, ఎంపీటీసీ దాసరి లక్ష్మిదేవి, పాటిల్ శివగౌడు, జెడ్పీటీసీ హనుమంతు, జేసీఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, సీనియర్ నాయకులు భీంరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా నాయకులు సుంకన్న, ఎస్సీ సెల్ మండల నాయకులు ప్యాపిలి నాగారాజు, డిష్ వెంకటే శులు, సొసైటీ చైర్మన్ బోయ శ్రీరాములు, షన్ముఖగౌడు, నల్లసుంకన్న, ఎంపీటీసీలు దాసరి వెంకటేశులు, పొట్లి సుంకన్న, కుడితిని రాము,శర్మాస్, రహమత్‌హుస్సేన్, బోయరాజు, సుంకిరెడ్డి, డిష్ వెకటేశులు పాల్గొన్నారు.

## నేడు విశ్వేశ్వర రెడ్డి ప్రచారం

కూడేరు: మండలంలోని పి.నారాయణపురం, కరుట్లపల్లి, కడదరకుంట గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి వై. విశ్వేశ్వర రెడ్డి మంగళవారం ప్రచారం చేయనున్నట్లు ఎంపీపీ నారాయణరెడ్డి సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు పి.నారాయణపురంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

# గుంతకల్లు అసెంబ్లీ బరిలో 14 మంది



ఉరవకొండలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమైన రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్

గుంతకల్లు: గుంతకల్లు నియోజకవర్గ అసెంబ్లీకి 14 మంది పోటీలో ఉన్నట్లు ఆర్వో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 మంది అభ్యర్థులు 37 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా అందులో ముగ్గురు అభ్యర్థులు స్క్రూటినీలో నామినేషన్లు తిరస్కరణకు గురయ్యారన్నారు. మిగిలిన 17 మంది అభ్యర్థుల్లో ముగ్గురు సోమవారం నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా కే.ప్రభాకర్, టీడీపీ అభ్యర్థిగా గుమ్మనూరు జయరాం, బహుజన్ సమాజ్‌పార్టీ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ మాలిక్, సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థిగా జనగాం కృష్ణ, భారతీయ చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా శశిభూషణ్‌రెడ్డి, జైభీమ్ రావ్ భారతీయ పార్టీ అభ్యర్థిగా పి.రహిమతోపాటు ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్నారన్నారు. ఇది ఇలా ఉండగా గుత్తికి చెందిన షేక్ మహబుబ్‌బాషాకు గ్లాస్ టంబర్ల్ గుర్తును కేటాయించడం విశేషం.

**ఉరవకొండ బరిలో 11 మంది ..**

ఉరవకొండ: స్థానిక రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. తుది జాబితాలో 11 మంది అభ్యర్థులు బరిలో నిలవగా ఇందులో నలుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు ఉన్నారు. బరిలో ఉన్న వారిలో వై.విశ్వేశ్వర రెడ్డి (వైఎస్సార్‌సీపీ) పి.కేశవ్ (టీడీపీ) వై.మధుసూదన్‌రెడ్డి (కాంగ్రెస్), అంకె తిప్పేస్వామి (బీఎస్పీ), కురుబ చిన్నక్క(ఆలిండియా కిసాన్ జనతాపార్టీ) , బెస్త పవన్‌కుమార్ (భారతీయ చైతన్య యువజన పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా మోహన్‌దాస్, బి.చంద్రశేఖర్‌రెడ్డి, కె.దామోదర్‌రెడ్డి, విశ్వేశ్వరయ్య స్వామి ఉన్నారు.

## వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి



మాట్లాడుతున్న వై.భీమిరెడ్డి

గుత్తి రూరల్: వైఎస్సార్‌సీపీ అనంతపురం ఎంపీగా శంకర్‌నారాయణ, గుంతకల్లు ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు వై.భీమిరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని పెద్దొడ్డి, అనగానదొడ్డి గ్రామాల్లో ఆయన ఇంటింటికి వెళ్లి సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ చేసేదే చెప్తారని, అపద్దపు హామీలు ఇవ్వరన్నారు. మళ్లీ జగన్ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు అమలు అవుతాయన్నారు. చంద్రబాబు అపద్దపు హామీలను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ చిన్న వీరన్నగౌడ్, సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్‌కుమార్‌యాదవ్, బేడల వెంకట్రాముడు, ఉపేంద్ర, మాజీ సర్పంచ్ కొండయ్య, కాశీనాథ్ రెడ్డి, హనుమంతురెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.